కుర్రాళ్లు కుమ్మేశారు

తొలి టీ20లో భారత్ సునాయాస విజయం

అర్ష్‌దీప్, వరుణ్ ధాటికి బంగ్లా బెంబేలు ● హార్దిక్, సూర్య దూకుడు

గ్వాలియర్ : ఈ ఏడాది పొట్టి ప్రపంచకప్ టైటిల్ గెలిచాక స్వదేశంలో ఆడిన తొలి టీ20 మ్యాచ్‌లో యువ భారత్ దుమ్మురేపింది. తమకంటే అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన బంగ్లాదేశ్‌ను 7 వికెట్ల తేడాతో చిత్తుచేసింది. మాధవరావు సింధియా నూతన క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', అర్ష్‌దీప్ సింగ్ (3/14), స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (3/31) ధాటికి బంగ్లా 19.5 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. మెహిది హసన్ (35 నాటౌట్) టాప్ స్కోరర్. ఈ మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన మయాంక్ యాదవ్ (1/21) ఆకట్టుకున్నాడు. అనంతరం స్వల్ప ఛేదనను భారత్ 11.5 ఓవర్లలోనే దంచేసింది. హార్దిక్ పాండ్యా (16 బంతుల్లో 39 నాటౌట్, 5 ఫోర్లు, 2 సిక్సర్లు), సూర్యకుమార్(29) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. శాంసన్ (29) ఉన్నంతసేపు మెరుపులు మెరిపించాడు.

అర్ష్‌దీప్, వరుణ్ అదుర్స్

అర్ష్‌దీప్ మొదటి ఓవర్లోనే లిటన్ దాస్ (4)ను పెవిలియన్‌కు పంపి బంగ్లా వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. తన మరుసటి ఓవర్లో హోసేన్ ఎమోన్ (8)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. వరుణ్ చక్రవర్తి 5వ ఓవర్లో తౌహిద్ హృదయ్ (12) రెండు ఫోర్లు బాదగా శాంతో (27) సిక్సర్ కొట్టి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించే యత్నం చేశారు. కానీ అతడే వేసిన 7వ ఓవర్లో తౌహిద్.. హార్దిక్‌కు క్యాచ్ ఇచ్చాడు. తొలి ఓవరే మెయిడిన్ వేసిన యువ పేస్ సంచలనం మయాంక్ యాదవ్ తన రెండో ఓవర్లో మహ్మదుల్లాను ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచాడు. శాంతోను వాషింగ్టన్ సుందర్ ఔట్ చేశాడు. ఆ తర్వాత వచ్చినవారిలో మిరాజ్ ఒక్కడే కాస్త దూకుడుగా ఆడటంతో బంగ్లా ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

భారత్ ధనాధన్..

ఛేదనలోను భారత్ దూకుడుగా ఆరంభించింది. షోరిపుల్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే శాంసన్ రెండు బౌండరీలు సాధించాడు. రెండో ఓవర్‌లో మరో ఓపెనర్ అభిషేక్ శర్మ.. 6, 4, 4 తో జోరు చూపించినా దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు. ఈ క్రమంలో సంజూతో జతకలిసిన సూర్య.. బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అరంగేట్రం మ్యాచ్ ఆడుతున్న తెలుగు కుర్రాడు నితీశ్‌రెడ్డి (16 నాటౌట్)తో జతకలిసిన హార్దిక్ పాండ్యా.. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగడంతో 49 బంతులు మిగిలుండగానే భారత్ గెలిచింది.

సుకన్యకు రజతం

కురవి, అక్టోబర్ 6: దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీ వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ టోర్నీలో భారత యువ లిఫ్టర్ తేజావత్ సుకన్య రజత పతకంతో మెరిసింది. ఆదివారం జరిగిన మహిళల 76కిలోల విభాగంలో బరిలోకి దిగిన సుకన్య లిఫ్ట్‌లో 107.5కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. ఇదే కేటగిరీలో పోటీపడ్డ భారత్‌కు చెందిన వైశాలి(112.5కి), బెల్ ఎలెనా(100కి, ఐర్లాండ్) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మాహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కలెక్టర్ తండాకు చెందిన సుకన్య నమస్తే తెలంగాణతో మాట్లాడుతూ తనకు ఆర్థికంగా అండగా నిలిచిన గ్రీన్‌కో గ్రూపు సీఎండీ అనిల్‌కుమార్‌కు రుణపడి ఉంటానని పేర్కొంది.

ఐసీసీ ఈవెంట్స్‌లో పాకిస్థాన్‌పై ఘనమైన రికార్డు కలిగిన భారత మహిళల క్రికెట్ జట్టు.. దాయాదుల పోరులో మరోసారి పైచేయి సాధించింది. యూఏఈలో జరుగుతున్న పొట్టి ప్రపంచకప్‌ను ఓటమితో మొదలుపెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. పాక్‌పై మాత్రం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించి ఈ టోర్నీలో బోణీ కొట్టింది. మొదట బౌలింగ్‌లో హైదరాబాదీ అరుంధతిరెడ్డి, రేణుకాసింగ్ ఠాకూర్ కట్టుదిట్టమైన పేస్‌కు పాక్ బెంబేలెత్తగా యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ ఆ జట్టుపై మరింత ఒత్తిడి పెంచింది. స్వల్ప ఛేదనే అయినా భారత్‌కు విజయం అంత ఈజీగా దక్కలేదు. షఫాలీ, జెమీమా, మంధాన, హర్మన్, రిచా వంటి స్టార్ బ్యాటర్లున్నా టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లే నమోదవడం గమనార్హం.

మహిళల టీ20 ప్రపంచకప్

భారత్ బోణీ

పాకిస్థాన్‌పై విజయం ● మెరిసిన అరుంధతి రెడ్డి, షఫాలీ వర్మ ● సెమీస్ ఆశలు సజీవం

దుబాయ్: యూఏఈ వేదికగా జరుగుతున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ గెలుపు బోణీ చేసింది. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన టీమ్‌ఇండియా.. ఆదివారం పాకిస్థాన్‌పై 6 వికెట్ల తేడాతో గెలిచి సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. దుబాయ్ వేదికగా దాయాదితో జరిగిన పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. మొదట పాకిస్థాన్‌ను నిర్ణీత ఓవర్లలో 105/8 పరుగులకే కట్టడి చేసింది. అరుంధతిరెడ్డి (3/19), స్పిన్నర్ శ్రేయాంక పాటిల్(2/12) పాక్‌ను నిలువరించారు. పాక్ జట్టులో నిదా దర్ (34 బంతుల్లో 28, 1 ఫోర్) ఫర్వాలేదనిపించింది. స్వల్ప ఛేదనే అయినప్పటికీ భారత్ దానిని 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (35 బంతుల్లో 32, 3 ఫోర్లు) తన సహజ శైలికి భిన్నంగా ఆడగా హర్మన్‌ప్రీత్ (24 బంతుల్లో 29 రిటైర్డ్ హర్ట్, 1 ఫోర్) కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడింది. అరుంధతికే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

ఆరంభం నుంచే తడబాటు..

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పాక్ ఆరంభం నుంచే వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్ల ధాటికి ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. రేణుకా సింగ్ వేసిన తొలి ఓవర్ ఆఖరి బంతికి ఫెరోజా ఖాతా తెరవకుండానే క్లీన్‌బౌల్డ్ అయింది. వన్ డౌన్‌లో వచ్చిన సిద్రా అమిన్ (8) దీప్తి శర్మ 5వ ఓవర్లో బౌల్డ్ అయి వెనుదిరిగింది. అరుంధతి ఏడో ఓవర్లో ఒమైమ సోహైల్ (3)ను ఔట్ చేయడంతో పాక్ కష్టాలు రెట్టింపయ్యాయి. శ్రేయాంక పాటిల్ వేసిన పదో ఓవర్లో మునీబా అలీ (17) స్టంపౌట్ అయింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో తొలి పది ఓవర్లలో ఏకంగా 38 డాట్ బాల్స్ నమోదవడం విశేషం. 13వ ఓవర్లో అలియా రియాజ్ (4) కూడా అరుంధతి బౌలింగ్‌లోనే ఎల్బీగా ఔట్ అయి డగౌట్ చేరింది. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో నిదాను బౌల్డ్ చేసిన అరుంధతి మూడో వికెట్‌ను సాధించింది.

భారత్ కూడా నెమ్మదిగానే..

స్వల్ప లక్ష్యమే అయినప్పటికీ భారత్ వేగంగా పరుగులు రాబట్టలేకపోయింది. స్పిన్‌కు అనుకూలిస్తున్న దుబాయ్ పిచ్‌పై పాక్ తొలి ఓవర్ నుంచే స్పిన్నర్లను దించి భారత్ దూకుడుకు అడ్డుకట్ట వేసింది. 16 బంతులాడిన ఓపెనర్ స్మృతి మంధాన (7) ఐదో ఓవర్లోనే పెవిలియన్ చేరింది. ఆరంభం నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే షఫాలీ కూడా డిఫెన్స్‌తో పాటు సింగిల్స్‌కే ప్రాధాన్యమివ్వడంతో ఓవర్‌కు 5 రన్‌రేట్ కూడా నమోదుకాలేదు. 8వ ఓవర్ దాకా భారత్ ఖాతాలో ఒక్క ఫోర్ కూడా రాలేదంటే ఇన్నింగ్స్ ఎంత మందకొడిగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. జెమీమా రోడ్రిగ్స్ (28 బంతుల్లో 23) తో కలిసి షఫాలీ రెండో వికెట్‌కు 43 పరుగులు జతచేసినా ఈ ఇద్దరూ సింగిల్స్‌కే పరిమితమయ్యారు. 12వ ఓవర్లో షఫాలీ నిష్క్రమణ తర్వాత క్రీజులోకి వచ్చిన హర్మన్‌ప్రీత్ కూడా ఆచితూచి ఆడింది. 16వ ఓవర్లో రోడ్రిగ్స్ పెవిలియన్ చేరినా దీప్తి శర్మ (7 నాటౌట్) అండతో హర్మన్ టీమ్‌ఇండియాను విజయతీరాలకు చేర్చింది.

పెరగని నెట్ రన్‌రేట్..

ఈ మ్యాచ్‌లో భారత్ గెలిచినప్పటికీ పాయింట్ల పట్టికలో మాత్రం పాకిస్థాన్ తర్వాత నాలుగో స్థానంలో ఉంది. తొలి మ్యాచ్‌లో కివీస్ చేతిలో దారుణంగా ఓడటంతో భారత నెట్ రన్‌రేట్ దారుణంగా పడిపోయింది. ఇక పాక్‌తో మ్యాచ్‌లో భాగంగా ఛేదనలో భారత ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లే నమోదయ్యాయి. టాపార్డర్ బ్యాటర్లంతా వికెట్ కాపాడుకుంటూ సింగిల్స్‌కే ప్రాధాన్యమివ్వడంతో పాక్‌పై గెలిచినప్పటికీ మన నెట్ రన్‌రేట్ (-1.127) మైనస్‌లోనే ఉంది. పాకిస్థాన్ (+0.555) మూడో స్థానంలో మెరుగ్గా ఉంది. సెమీస్ బెర్తును ఖాయం చేసుకోవాలంటే భారత్ రాబోయే శ్రీలంక, ఆస్ట్రేలియా మ్యాచ్‌లలో భారీ విజయాలు సాధించడం అవసరం. గ్రూప్ దశలో టాప్-2లో ఉన్న జట్లే సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 105/8 (నిదా దర్ 28, మునీబా 17, అరుంధతి 3/19, శ్రేయాంక 2/12)

భారత్: 18.5 ఓవర్లలో 108/4 (షఫాలీ 32, హర్మన్‌ప్రీత్ 29, ఫాతిమా 2/23, ఒమైమ 1/17)

గాఫ్‌దే చైనా ఓపెన్

ఫైనల్‌లో ముచోవాపై గెలుపు

బీజింగ్: మహిళల టెన్నిస్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్ కోకో గాఫ్ ఈ ఏడాది చైనా ఓపెన్‌లో విజేతగా నిలిచింది. ఆదివారం బీజింగ్‌లోని డైమండ్ కోర్ట్ వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో గాఫ్.. 6-1, 6-3తో కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్)ను వరుస సెట్లలో చిత్తు చేసి టైటిల్ కైవసం చేసుకుంది. ఫైనల్‌లో గాఫ్ 6 ఏస్‌లు సంధించగా ముచోవా 2 మాత్రమే కొట్టగలిగింది. ఈ టోర్నీలో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన గాఫ్.. గత మ్యాచ్‌లకు భిన్నంగా ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ వరుస సెట్లలో గెలిచి ట్రోఫీని దక్కించుకుంది. తద్వారా 2013 (సెరెనా విలియమ్స్) తర్వాత చైనా ఓపెన్ గెలిచిన రెండో ప్లేయర్‌గా గాఫ్ రికార్డులకెక్కింది. ఈ ఏడాది ఆమెకు ఇది రెండో డబ్ల్యూటీఏ 1000 టైటిల్ కాగా ఓవరాల్‌గా 8వ టైటిల్. ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కారజ్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే.

ధోనీ ట్రెండ్ సెట్టర్ : గేల్

శ్రీనగర్: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీపై విండీస్ దిగ్గజం క్రిస్ గేల్ ప్రశంసల వర్షం కురిపించాడు. ధోనీ ఒక ట్రెండ్ సెట్టర్ అని అభివర్ణించాడు. భారత్‌లో జరుగుతున్న లెజెండ్స్ లీగ్ క్రికెట్(ఎల్ఎల్‌సీ)లో భాగంగా గుజరాత్ జెయింట్స్‌కు ఆడుతున్న గేల్ మాట్లాడుతూ.. 'భారత జట్టుకు ధోనీ అత్యంత విజయవంతమైన సారథి. అతడు ఒక ట్రెండ్‌ను సెట్ చేశాడు. అతడి బాటలోనే రోహిత్ శర్మ కూడా తన పాత్రకు తగిన న్యాయం చేస్తున్నాడు. కోహ్లీ కూడా బాగా కెప్టెన్సీ చేశాడు' అని అన్నాడు.

లండన్ ఐటీఎఫ్ మాస్టర్స్ టోర్నీలో భారత ప్లేయర్ వెంకట నారాయణ మూర్తి రన్నరప్‌గా నిలిచాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.